# యేసు నిజంగా ఎవరో పిల్లలు నేర్చుకొంటారు

**ప్రార్థన :** ప్రియమైన ప్రభువా, యేసు జీవించిన జీవితాన్ని ఆరాధనా పూర్వకంగా ప్రశంసించడానికి మరియు ఆయన నిజమైన ఏకైక దేవుని కుమారుడనీ, మానవజన్మనెత్తాడనీ విశ్వసించడానికి పిల్లలకు సహాయం చేయండి.

పిల్లల కొరకు క్రింద ఇవ్వబడిన ఏ అభ్యాస క్రియనైనా **ఎన్నుకొండి.**

ఒక పెద్ద పిల్లవాడు లేదా అమ్మాయి **లూకా 19:28-40** నుండి యేసు చివరిసారిగా విజయోత్సాహంతో యెరూషలేంలోకి ప్రవేశించడాన్ని వివరించాలి. సామాన్య ప్రజలు యేసును తమకు వాగ్దానం చేయబడిన మెస్సయ్యాగాను ఈ లోకానికి స్వాతంత్ర్యాన్ని శాంతిని తెచ్చే రాజుగాను భావించి ఏ విధంగా స్తుతించారో ఈ సంఘటన తెలుపుతుంది.

కథ చెప్పిన తర్వాత క్రింది **ప్రశ్నలడగండి.** *(ప్రతి ప్రశ్నకు ఎదురుగా జవాబు ఇవ్వబడింది)*

- యెరూషలేంలోకి స్వారీచేస్తూ వెళ్ళడానికి యేసుకు గాడిదపిల్ల ఎలా దొరికింది? *(30వ వచనం చూడండి)*
- గాడిదపిల్ల యొక్క యజమానితో యేసు శిష్యులు ఏమి చెప్పారు? *(34వ వచనం చూడండి)*
- యేసు వెళ్తుండగా ప్రజలు కొమ్మలను నరికి దారిపొడవునా పరిచారని ఈ వాక్యభాగం చెప్తుంది. ఇంకా ఏ విధానాలలో ప్రజలు తమ సంతోషాన్ని, స్తుతిని వ్యక్తం చేశారు? *(36, 37 వచనాలు చూడండి)*
- యేసు ఎవరని ప్రజలు అన్నారు? *(38వ వచనం చూడండి)*
- ప్రజలు కేకలు వేయకుండా ఉంటే ఏం జరుగుతుందని యేసు చెప్పాడు? *(39-40వ వచనాలు చూడండి)*

ఈ సంఘటన పూర్వాపరాలను వివరించండి.

- యేసు సిలువ వేయడానికి ముందు ఆదివారం రోజున యెరూషలేముకు వచ్చాడు.
- కొంత మంది క్రైస్తవులు ఆ ఆదివారాన్ని “మట్టల ఆదివారం” అని అంటారు. ఎందుకంటే ప్రజలు ఆయన వెళ్ళేదారి అంతా మట్టలు పరిచి అలంకరించారు.



- యేసు తాను పునరుత్థానుడై లేచే రోజుకు సరిగా ఒక వారం ముందు యెరూషలేంలోకి ప్రవేశించాడు. మానవ చరిత్ర అంతటిలో అతి ప్రాముఖ్యమైన సంఘటనలు ఆ వారంలోనే జరిగాయి.
- కొంత మంది నాయకులు మరియు ప్రభుత్వాధికారులు తమ అధికారాన్ని పలుకుబడిని ఆయన తొలగిస్తాడని భయపడ్డారు.
- చాలా మంది ప్రజలు యేసుచేత స్వస్థత నొంది, ఈ లోకానికి వస్తాడని పాతనిబంధన ప్రవక్తలు ప్రవచించిన మెస్సయా ఆయనేనని గుర్తించారు.

- మానవునిగా మారిన దేవుడే యేసు, ఆయన దేవదూతకాదు లేదా దేవునికీ మానవునికీ మధ్యస్థంగా ఉండే మరేదో కూడ కాదు. ఆయన దేవుడు మరియు మానవుడు కూడ అందువల్లనే పరలోకానికీ మరియు భూలోకానికీ మధ్య వారధి అయ్యాడు.

లూకా 19:28–40లోని వాక్యభాగం ఆధారంగా యేసు విజయోత్సవంతో యెరూషలేంలోకి ప్రవేశించిన సంఘటనను **నాటికగా ప్రదర్శించండి.**

- సంఘ ఆరాధనకు నాయకత్వం వహించే ముఖ్య నాయకునితో కలిసి ఈ నాటికను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయండి.
- పిల్లలకు మీరు భోదించే సమయంలోనే నాటికను ప్రదర్శించడానికి పిల్లలను సిద్ధపర్చండి.
- చిన్న పిల్లలు సిద్ధపడుతుండగా వారికి పెద్ద పిల్లలు సహాయపడేలా చూడండి.
- అన్ని పాత్రలు ధరించడానికి పిల్లలు సరిపోనట్లయితే కథకుడే ఆ పాత్రల సంభాషణలను చదవాలి.
- పెద్ద పిల్లలు లేదా పెద్దవారు–యేసు ప్రభువు, గాడిద మరియు గాడిద యజమాని పాత్రలు ధరిచాలి. ఒకరు కథకునిగా వ్యవహరిస్తూ పిల్లలు ఎప్పుడు ఏమిచేయాలి. ఏం పలకాలో జ్ఞాపకం చేయాలి.
- చిన్న పిల్లలు–శిష్యులు, పరిసయ్యులు మరియు జనసమూహంలోని వ్యక్తుల పాత్రలు ధరించాలి. వారి చేతులలో కొమ్మలు మట్టలు, బట్టలు ఉండాలి.

**కథకుడు :** లూకా 19:28–35 నుండి కథలోని ముందు భాగం చెప్పి “యేసు తన శిష్యులతో ఏమంటున్నాడో వినండి” అని అనాలి.

**యేసు :** నేను యెరూషలేముకు వెళ్ళాల్సిన సమయం వచ్చింది. ప్రక్క ఊరికి వెళ్లి అక్కడ కట్టబడి ఉన్న గాడిదను తోలుకొని రండి. దాని యజమాని అడిగితే అది ప్రభువుకు కావాలి అని చెప్పండి.

**శిష్యుడు :** గాడిద వరకు వెళ్ళి దానిని విప్పినట్టుగా నటించి దానిపై ఒక అంగీని వెయ్యాలి.

**గాడిద యొక్క యజమాని :** ఆగు! నా గాడిదనేం చేస్తున్నావు?

**శిష్యుడు :** ఇది ప్రభువుకు కావాలి.

**గాడిద యొక్క యజమాని :** అయితే సరే, తీసుకెళ్ళు.

**శిష్యుడు :** గాడిదను యేసు నొద్దకు తీసుకొని వస్తాడు.

**యేసు :** గాడిదపై ఎక్కి స్వారీ చేస్తాడు.

**గాడిద యొక్క యజమాని :** చూడండి. యేసు నా గాడిదపై స్వారీ చేస్తున్నాడు. ఇంతకు ముందెవరూ దానిపై స్వారీ చేయలేదు.

**కథకుడు :** లూకా 19:36–40 నుండి కథలోని రెండవ భాగం చెప్పి “వినండి జనసమూహం ఏమంటుందో!” అంటాడు.

**జనసమూహం :** తమ వస్త్రాలు అంగీలు యేసు ముందు నేలపై పరుస్తారు. చేతిలోని కొమ్మలనూపుతూ “దేవునికి మహిమ” హోసన్నా “రారాజు వస్తున్నాడు” అని అరుస్తూ, యేసు ముందుకు నడుస్తుండగా ఆ కొమ్మలు కూడ నేలపై పరుస్తారు.

**పరిసయ్యులు :** (కోపంగా) యేసూ, నీ శిష్యులనావిధంగా అనవద్దని చెప్పు.

**యేసు :** వారు ఊరుకుంటే...ఈ రాళ్ళు కేకలేస్తాయి.

**కథకుడు లేదా ఒక పెద్ద అబ్బాయి / అమ్మాయి :** నాటిక ప్రదర్శన అయిపోయిన తర్వాత సహాయపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత తెలపాలి.

**ప్రశ్నలు :** ఒకవేళ ఈ నాటికను చిన్న బిడ్డలు పెద్దల ముందు ప్రదర్శించినట్లయితే పైన వ్రాయబడిన ప్రశ్నలను వారు పెద్దలనడగవచ్చు.


**కవిత :** చాలా మంది పిల్లలు కీర్తన 118:22–24, 26 మరియు 28 వచనాలను అప్పచెప్పాలి.

మనమింకే విధంగా యేసును మన ప్రభువుగానూ రాజుగానూ కీర్తించగలమో పిల్లలను చెప్పమనండి. పిల్లలు మరియు పెద్దలు ఉదాహరణలివ్వాలి.

**చిత్రం :** ఒక తాటి మట్ట పటాన్ని గీసి దానిని చూస్తూ పిల్లలను కూడ గీయమనండి.



- పెద్ద పిల్లలు తాటిచెట్టు పటాన్ని గీయవచ్చు.



- పిల్లలు తాము గీసిన పటాలను ఆ తర్వాత ఆరాధనా సమయంలో పెద్దలకు చూపించాలి. మనం క్రీస్తును మన ప్రభువుగానూ, రాజుగానూ ఎలా స్తుతించాలో ఆ చెట్లకొమ్మలు సూచిస్తున్నాయని వివరించాలి.

**కంఠత వాక్యం :** యోహాను 14:6

**కథకుడు :** "ప్రియమైన దేవా, నీవే మా అద్వితీయ దేవుడవు, మేము నిన్ను ఆరాధిస్తున్నాం. నీవు నిజంగా ఎవరో ఇంకా కొంతమంది గుర్తించనప్పటికీ నీవు ఎంత అద్భుతమైనవాడవో మాకు తెలుసు. అందువల్లనే నిన్ను స్తుతించి కొనియాడుతున్నాం. అందరూ నిన్ను స్తుతించులాగున ఇతరులకు నిన్ను గూర్చి చెప్పడానికి మాకు సహాయం చేయి".

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net